క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ మంగళవారం ప్రకటించారు. గాంధీపార్క్ ఎదురు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టీటీడీ కల్యాణ మండపం రోడ్, గానుగ వీధి, పాండురంగ స్వామి గుడి వీధి, ఆదిత్య హాస్పిటల్, విజయ హాస్పిటల్, టిప్పీ టాప్పీ, సురుచి స్వీట్స్ బైపాస్ రోడ్డు, బొమ్మిరెడ్డి సుధా హాస్పిటల్, బాటషోరూమ్, డామినోస్, చిన్న గాంధీ బొమ్మ, గుంటూరు మెస్ రోడ్,యాక్సిక్‌బ్యాంక్ ఏరియా, ఎస్‌కేవీటీ కాలేజ్ ఏరియా, ప్రదీప్ హాస్పటల్ నందం గనిరాజు జంక్షన్ ఏరియాలో కరెంట్ ఉంటుందన్నారు.

పుష్పాల బాపిరాజుకు డాక్టరేట్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయులు డాక్టర్ గోపాల బాపిరాజు మరో డాక్టర్ పట్టా అందుకున్నారు. ఈ వివరాలను మంగళవారం ఆయన విలేకర్లకు తెలిపారు. హంగేరీకి చెందిన గోల్డ్ మాస్టర్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లిటరేచర్ సంస్థ ఈ పట్టాను ఆన్‌లైన్ ద్వారా అందజేసినట్టు పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో పాజిటివ్ దృక్పధాన్ని పెంచిన చిత్రాలు గీయడంతో పాటు భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను తన చిత్రకళ ద్వారా యువతకు చక్కని సందేశాన్నిస్తున్నందుకు అభినందిస్తున్నామని, గౌరవ డాక్టరేట్ అందజేస్తున్నామని అకాడమీ ప్రెసిడెంట్ మారియా లిప్టాక్, అకాడమీ సలహాదారు డాక్టర్ బసమ్ బిశ్రా జబ్లా తమ సందేశంలో పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వాల నమోదు



ధవళేశ్వరంలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

ధవళేశ్వరం: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ధవళేశ్వరం బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ యువమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ సాజీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ యువమోర్చ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ మాట్లాడుతూ బీజేపీ హయాంలో దేశంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిగాయన్నారు. అనంతరం సభ్యత్వాలు నమోదు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు, యువమోర్చ రాష్ట్ర కార్యదర్శులు కందుకూరి మనోజ్‌బాబు, చిన్నారి, అసెంబ్లీ కన్వీనర్ యానాపు ఏసు తదితరులు పాల్గొన్నారు.

కనెక్షన్ లేక.. ముందుకు సాగక

- నిలిచిపోయిన మురుగు నీరు
- డ్రైనేజీ నిర్మించారు..కనెక్టివిటీ మరిచారు
- రూ.కోటి నిధులతో డ్రైనేజీ నిర్మాణం

రాజమహేంద్రవరం రూరల్: సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ముందుకు సాగక నిలిచిపోతోంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సైన్స్ సెంటర్, ప్రభుత్వ కార్యాలయాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రూ.కోటి నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టినప్పటికీ, సదరు కాంట్రాక్టరు కనెక్టివీ ఇవ్వకపోవడంతో ఆ డ్రైనేజీ నిరుపయోగంతోపాటు, గృహనిర్మాణ శాఖ నిర్మితి కేంద్రంలోకి మురుగునీరు వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మూరు మురళీ కొండపై మురుగు నీరు, వర్షపు నీరు మహిళా ప్రాంగణం నుంచి సైన్స్ సెంటర్ మీదుగా వెళుతుండేది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు సైన్స్‌సెంటర్ ఆవరణలోకి వెళ్లిపోవడంతో గత ప్రభుత్వంలో రూ.కోటి నిధులను మంజూరు చేసి పనుల బాధ్యతలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు అప్పగించారు. సదరు కాంట్రాక్టరు డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేశారు కానీ దానికి రెవెన్యూ కాలనీ డ్రైనేజీకి అనుసంధానం చేయకపోవడంతో పలు సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా డ్రైనేజీ నిర్మాణంలో చివర రోడ్డు కింద కల్వర్టు నిర్మాణం చేశారు. అయితే మురుగునీరుతో పాటు వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు అధికరావడంతో కల్వర్టు పూడికపోవడం జరిగింది. దీని వల్ల కల్వర్టు నుంచి మురుగునీరు బయటకు వెళ్లకపోవడం వల్ల అది వెనక్కి తన్ని బయటకు వచ్చేస్తుంది. ఈ మురుగునీరు వెళ్లి గృహ నిర్మాణ శాఖకు చెందిన నిర్మితి కేంద్రంలోకి వెళ్లి చేరుతుంది. చేసేది లేక సదరు ఉద్యోగులు లోపలికి మురుగునీరు ప్రవేశించకుండా పక్కకు దారి మళ్లించిన ఆ మురుగు నీరు



డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి కల్వర్టు వద్ద నిలిచిన మురుగునీరు





గృహనిర్మాణశాఖ నిర్మితికేంద్రం వద్ద ఖాళీప్రదేశంలో నిలిచిన మురుగునీరు

ముందుకు వెళ్లి రోడ్డుపైన పొంగిపొర్లుతుంది. దీని వల్ల వాహనచోదకులు, ప్రభుత్వ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

పూడికలు తీయించి డ్రైనేజీ కనెక్టివిటీ ఇవ్వాలి

సైన్స్‌సెంటర్, రూరల్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు వైటీసీలో ఉన్న పది ప్రభుత్వ కార్యాలయంలు నుంచి వచ్చే వాడకం నీరు ఈ డ్రైనేజీ ద్వారానే ప్రవహిస్తుంటోంది. వైటీసీ వెనుక ఉన్న రాజీవ్‌కాలనీ నుంచి వచ్చే మురుగునీరు సైతం డ్రైనేజీ పక్క నుంచి వస్తుంది. కల్వర్టు నుంచి వస్తున్న మురుగునీరుతోపాటు, రాజీవ్‌కాలనీ నుంచి వచ్చే మురుగునీరు చేరడంతో ఆ ప్రాంతం అంతా బురదమయంగా మారి దుర్వాసన వెలువడుతోంది. ఈ బురదలో పందులు సైతం స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి కల్వర్టులో పూడికలు తీయించి, డ్రైనేజీ నిర్మాణం చేసిన సదరు కాంట్రాక్టరు రెవెన్యూ కాలనీ డ్రైనేజీకి కనెక్టివిటీ ఇస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని రాజీవ్‌నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.

టిడ్కో అధికారులు అబ్జక్షన్ పెట్టారు

“డ్రైనేజీని రెవెన్యూ కాలనీ మీదుగా టిడ్కో డ్రైనేజీకి కలపాలి. అయితే టిడ్కో అధికారులు డ్రైనేజీకి కలుపవద్దని అభ్యంతరం పెట్టి అప్పటి స్పందనలో ఫిర్యాదు చేశారు. అందువల్ల ఆగింది. కల్వర్టు వద్ద పూడికలను పంచాయతీ కార్యదర్శికి చెప్పి తీయించే ఏర్పాట్లు చేస్తాం. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని పంపించి పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతాం.”

– శ్రీనివాసరావు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రాజమహేంద్రవరం

కొంతమూరులో మరో చోరీ



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులో సోమవారం అర్ధరాత్రి మరో చోరీ జరిగింది. 29 కాసుల బంగారు నగలతోపాటు రూ.40 వేలు నగదును కూడా దుండగులు అపహరించుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించిన స్థానిక సీఐ ఎస్పీ వీరయ్యగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతమూరు, అగ్రహారం వీధిలో నివాసం ఉంటున్న కడియాల శ్రీకళ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం విజయవాడ వెళ్లారు. దీనిని అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కొందరు అర్ధరాత్రి సమయంలో ఇంటిలోకి ప్రవేశించి, బీరువాలో దాచిన 29 కాసుల బంగారు నగలను, రూ.40 వేలు నగదును తీసుకుని పరారయ్యారు. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన వారికి తలుపులు తెరచి ఉండడంతో కంగారుగా లోనికి వెళ్లి చూస్తే చోరీ జరిగిందని గ్రహించారు. పోయిన వస్తువుల విలువ రూ.15 లక్షలు పైబడి ఉంటుందని అంచనా. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ని రప్పించి, నిందితుల ఆనవాళ్ల కోసం పరిశోధిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తహసీల్దార్ కావలెను!

- మూడు నెలలుగా ఖాళీగా ఉన్న తహసీల్దార్ పోస్టు
- విధుల్లో చేరని ఎన్నికల డీటీ, సర్వేయర్లు



రూరల్ తహసీల్దార్ కార్యాలయం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోనే ఎక్కువ జనాభా ఉన్న మండలాల్లో ఒక్కటైన రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పోస్టు ఇప్పటికీ భర్తీ కాకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో ఎన్నికల ముందు వచ్చిన తహసీల్దార్ అప్పారావు ఇక్కడ నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి తహసీల్దార్ పోస్టు ఖాళీగానే ఉంది. రూరల్ తహసీల్దార్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ జేఎస్ లక్ష్మీరమ్య ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండు నెలలు క్రితం అన్ని మండలాలకు తహసీల్దార్‌లను భర్తీ చేసినప్పటికీ రూరల్ మండలానికి మాత్రం భర్తీ చేయలేదు. రూరల్ మండలంపై ఆశలు పెంచుకున్న ఒక తహసీల్దార్‌ను అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు భారీ మొత్తంలో డిమాండ్ చేయడంతో ఆయన వేరొక మండలానికి వెళ్లిపోయారు. అలాగే గత నెలాఖరున రూరల్ తహసీల్దార్ ఏఎస్ఆర్ జిల్లా పాడేరు తహసీల్దార్ శ్రీనివాసరావును నియమించినప్పటికీ ఆయన ఇప్పటివరకు విధుల్లో చేరలేదు. ఆయన రాజమహేంద్రవరం రూరల్ వచ్చేందుకు ఇష్టంలేకపోవడంతో ఆ జిల్లాలో మరో చోటికి వెళ్లేందుకు లైన్‌క్లియర్ చేసుకున్నట్టు తెలుస్తోంది. దీంతో రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పోస్టు కథ మరలా ముందుకు వచ్చింది. తహసీల్దార్ పోస్టుతో పాటు పోస్టింగ్ ఇచ్చినప్పటికీ డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్లు ఇప్పటివరకూ విధుల్లో చేరలేదు. ఇన్‌చార్జి తహసీల్దార్, డీటీ జేఎస్ లక్ష్మీరమ్యకు డీఎస్‌వో కార్యాలయం డీటీగా బదిలీ చేసినప్పటికీ రిలీవ్ చేసే డీటీ రాకపోవడంతో ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అత్యధిక జనాభా కలిగిన మండలంలో వివిధ రకాల ధృవీకరణ పత్రాలతోపాటు, అనేక రకమైన విధులు ప్రతిరోజు నిర్వర్తించాల్సి ఉంటుంది. కేవలం ఒక్క డీటీ మాత్రమే మూడు నెలలుగా విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి త్వరితగతిన తహసీల్దార్‌ను నియమించాలని, అలాగే విధుల్లో చేరాల్సిన ఇతర అధికారులు సైతం వచ్చేలా చూడాలని రూరల్ మండల ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తున్నాం

రాక్స్ ఫైట్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ రత్నాకర్

సీటీఆర్ఐ: ఎస్సీ వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా ఎస్సీల ఐక్యతను దెబ్బతీస్తున్న విధానంపై పోరాటానికి సిద్ధమవుతున్నామని రోర్ అగైనెస్ట్ కేటగిరైజేషన్ కాన్సిరస్ ఆఫ్ ఎస్సీస్ (రాక్స్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ రత్నాకర్ అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజా స్వామ్యయుతంగా ఈ పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సభలు, సమావేశాల ద్వారా ప్రయత్నిస్తున్నామని త్వరలో పాదయాత్రలు కూడా చేస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా యుద్ధం చేసే సమయం ఆసన్నమైందని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. 2011లో పంజాబ్‌లో దాఖలైన ఒక కేసులో ఈ విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే విధానం కుట్రపూరితంగా ఉందని, రాష్ట్రంలో మాదిగలపై ప్రేమ ఉంటే వారికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు ఇచ్చుకోవడం, పథకాలు అమలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్

చేయడం చేసుకోవాలే కానీ దళితుల ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ తీర్పు వచ్చేలా చేస్తే ఇక్కడ నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ప్రోత్సాహం అందించారని ఆరోపించారు. త్వరలోనే దీనిపై సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం ద్వారా క్యూరెటివ్ పిటిషన్ వేసేలా వత్తిడి తేవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ తీర్పును బట్టి ఎస్సీలను ఇంకా అంటరానితనంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నట్టుగా అర్థమవుతోందని విమర్శించారు. ఎస్సీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయకుండా ఉన్న ఖాళీల్లో 15 శాతం ఇస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అధ్యయనం చేసి అర్థం చేసుకునే తాము ఉద్యమానికి సిద్ధపడ్డామన్నారు. సమావేశంలో నాయకులు బి.నారాయుడు, కుమార్, విప్పర్తి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లి రాజేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ: రాజమండ్రి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పిల్లి రాజేష్ ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. రాజేష్ కుటుంబానికి అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఆయన కుటుంబ సభ్యుల పేరిట రూ.1,40,000 రాజమండ్రి హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో మంగళవారం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందజేశారు. రాజేష్ కుటుంబానికి సహాయ అందించిన వారందరికీ అసోసియేషన్ తరపున రాజమండ్రి విభాగం అధ్యక్షుడు సిరి శ్రీను అభినందించారు. సలహాదారులు రావు అండ్ రావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా అసోసియేషన్ తరపున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అసోసియేషన్‌లో ఎవరికీ ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్నామని, ఇందుకు సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. రాజేష్ మరణం తీరని లోటన్నారు. అతడి



ఎఫ్‌డీని అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కుటుంబానికి ఆదుకోడానికి ముందుకొచ్చిన సభ్యులందరికీ రావు అండ్ రావు కృతజ్ఞతలు తెలిపారు. కేతా శ్రీను మాట్లాడుతూ అసోసియేషన్ చేసే కార్యక్రమాలకు సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోని శ్రీను, సెక్రటరీ లీలా నాగు, ట్రెజరర్ ఆశ రాంబాబు, కోఆర్డినేటర్ వానపల్లి బాబీ, పీఆర్ ఓ గంగాధర్, గుర్రంనాగబాబు, నాగరాజు, బొమ్మూరు ప్రసాదు, శివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌సెంటర్ ప్రహరీపై నిర్లక్ష్యపు పొదలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని సైన్స్ సెంటర్‌లో నిర్లక్ష్యపుపొదలు అల్లుకున్నాయి. సైన్స్‌సెంటర్ ఇంకా ప్రారంభోత్సవం కాక ముందే ప్రహరీ ఇనుప చట్రంపై పొదలు విపరీతంగా అల్లుకున్నాయి. వీటి వలన ఎటువంటి విషసర్పాలు వస్తాయోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సైన్స్ సెంటర్ ఆవరణలో ఎప్పటికప్పుడు గార్డెనింగ్ చేస్తున్నారే తప్ప ప్రహరీపై ఉన్న పొదలను మాత్రం తొలగించడం లేదు. ఇప్పటికైనా సైన్స్‌సెంటర్ సిబ్బంది ప్రహరీపై ఉన్న పొదలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.



సైన్స్‌సెంటర్ ప్రహరీ ఇనుప చట్రంపై విపరీతంగా అల్లుకున్న పొదలు

అభయమివ్వమ్మా.. లోకమాతా..

- దేవీచౌక్‌లో రోజు రోజుకు భక్తుల రద్దీ
- అమ్మవారి దర్శనం కోసం గ్రామాల నుంచి భక్తుల రాక
- ఆరో రోజు లలితాదేవి అవతారంలో అమ్మవారు

సీటీఆర్ఐ: దసరా మహోత్సవాల్లో భాగంగా లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిచ్చారు. మంగళవారం ఆరో రోజు రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లోని అమ్మవారు శ్రీ లలితాదేవి అవతారంలో పూజలందుకున్నారు. అమ్మవారిని దర్శించేందుకు భక్తులు బారులు తీరారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనానికి వస్తున్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వట్టివేర్లతో అలంకరించారు. గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయశ్వర స్వామి వారి ఆలయంలో స్వయంభూవుగా వెలిసిన పార్వతీ మాతను శ్రీమహాలక్ష్మి దేవిగా అలంకరించారు. దేవీచౌక్‌లోని అమ్మవారిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ దర్శించుకున్నారు. స్థానిక బలరామపేటలో కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవాలయంలో అన్నపూర్ణదేవిఅమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సీతంపేట మాతృరూపిణి మందిరంలో అమ్మవారు సింహరూపిణి గా భక్తులకు దర్శినమిచ్చారు. మంగళవారం నాడు జరిగిన కార్యక్రమంలో 26 రకాల వంటకాలతో జగన్మాతకు నైవేద్యాలు సమర్పించారు. సమస్త వ్యవస్థాపకులు అజ్జరపు హరిబాబు మిగిలిన భక్త బృందం ఆధ్వర్యంలో మహిళలతో కుంకుమార్చనలు జరిగాయి. అనంతరం వేదాశీర్వచనం, అన్నసమారాధన నిర్వహించారు.

మహాలక్ష్మీదేవి అవతారంలో అపర్ణాదేవి

కడియం: కడియపులంకలోని హరిహర మహాక్షేత్రంలోని అపర్ణా సమేత అనంతేశ్వరాలయంలో కొలువైన అపర్ణాదేవి అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా వేడుకల ఆరవ రోజైన మంగళవారం అమ్మవారికి ఆలయ అర్చకులు నాని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వివిధ రకాల కరెన్సీ నోట్లతో అమ్మవారి ఆలయాన్ని అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలక్కుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

కరెన్సీతో అమ్మవారికి అలంకరణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులో ఉన్న దుర్గామల్లేశ్వర దేవాలయంలో సుమారు రూ.10 లక్షల కొత్త కరెన్సీనోట్లతో అమ్మవారిని అలంకరించారు. కుడిపూడి శ్రీనుబాబు, లక్ష్మి, సూర్యమణికంఠ, సౌజన్యదేవి, హేమరాజేష్, దేవి, గార్లపాటి వెంకటగోపాల్, లక్ష్మీతులసి ఆధ్వర్యంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. మహాలక్ష్మీదేవి అవతారంలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహాలక్ష్మీదేవి అలంకరణలో...

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయకనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మంగళవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించినట్లు ఆలయధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు.ఆలయ గౌరవాధ్యక్షులు పిల్లి శ్రీను నేతృత్వంలో కుంకుమపూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే బాలాజీపేటలో వేంచేసియున్న విజయకనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ప్రముఖన్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, వాసంశెట్టి సూర్యగణేష్, తలారి శ్రీనివాసరావు, సూరంపూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి 26 రకాల నైవేద్యాల సమర్పణ



శ్రీమహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో అన్నపూర్ణామాత



మహాలక్ష్మీగా దర్శనమిచ్చిన అపర్ణాదేవి




శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వట్టివేరులతో అలంకారం



దేవీచౌక్ బాల త్రిపుర సుందర దేవి ఆలయంలో లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



శ్రీ ఉమా మార్కండేయ స్వామి దేవాలయంలో మహాలక్ష్మీదేవి అలంకారం



దుర్గామల్లేశ్వరదేవాలయంలో అమ్మవారిని కరెన్సీతో అలంకరించిన దృశ్యం



మోరంపూడి సాయినగర్‌లో మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు



బాలాజీపేటలో విజయకనకదుర్గాదేవి ఆలయంలో కాత్యాయని మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు



ఉమా మార్కండేయ స్వామి గుడిలో మహాలక్ష్మి రూపంలో పార్వతీదేవి

సినిమాలు



శ్యామల	: 35చిన్నకథకాదు
సూర్యమినీ	: దక్షిణ
సూర్యప్యాలెస్	: దేవర
స్వామి	: శ్వాగ్
అశోక	: దేవర
శివజ్యోతి	: రామ్‌నగర్‌బన్నీ
అనుశ్రీ	: శ్వాగ్
రాజా	: దేవర
రంభ	: కమిటీకుర్రోళ్లు
ఊర్వశి	: సత్యం సుందరం
మేనక	: మత్తు వదలరా–2, మిస్టర్ సెలబ్రిటీ
కుమారి	: దేవర
అప్సర నామవరం	: దేవర
వీఎస్‌మహల్ ధవళేశ్వరం	: దేవర
మురళీకృష్ణ కడియం	: దేవర
వెంకటసూర్య	: దేవర